క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

నల్లమాడ: పాతబత్తలపల్లి సచివాలయం పరిధిలోని పుల్లగూరపల్లి, తోలేటిపల్లి, కొత్త బత్తలపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్పంచ్ మాసే రెడ్డెమ్మ ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు 'అఖండ జ్యోతి'

ఓడీ చెరువు: మండలంలోని ఎం.కొత్తపల్లి వద్ద వెలసిన అయ్యప్ప ఆలయంలో శనివారం అఖండ జ్యోతిని వెలిగించనున్నట్లు ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులు నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో మకరజ్యోతిని పురస్కరించుకుని ఇక్కడ 18 కిలోల కర్పూరంతో అఖండ జ్యోతి వెలగిస్తామన్నారు.

రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ, హెచ్‌ఎం

కనగానపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ముగ్గురు రాష్ట్ర స్థాయిలో జరిగే బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ రమేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగిన బేస్‌బాల్ క్రీడా పోటీల్లో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు. ఈ నెల 28 నుంచి 30 వరకు కాకినాడులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అండర్- 14 విభాగంలో వైష్ణవి, అండర్- 17 విభాగంలో అనూష, పృథ్వీ ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను హెచ్‌ఎం లక్ష్మిదేవి, చైర్మన్ విశ్వనాథ్, గ్రామస్తులు అభినందించారు.

లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలి

పుట్టపర్తి: మండలంలో జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలని బుక్కపట్నం ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన గశికవారిపల్లి సర్పంచ్ గోవిందరెడ్డితో కలిసి లబ్ధిదారులతో సమావేశం అయ్యారు. ఇప్పటికే ఇళ్లు మంజూరైన వారు ఇంటి నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే వెంటనే ఇళ్ల కోసం దరఖాస్తు చేసువాలన్నారు.

డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు

ఎన్‌పీకుంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ మండల స్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. తొలిరోజు మూడు మ్యాచ్‌లు నిర్వహించగా.. పెడబల్లి లయన్స్, ట్రూప్‌టైటన్స్, ఫ్రెండ్స్ వారియర్స్ జట్లు విజయం సాధించాయి. టోర్నీలో విజేతలుగా నిలిచిన విన్నర్స్ జట్టుకు రూ.20 వేలు, రన్నర్స్ జట్టుకు రూ.10 వేలు ప్రైజ్ మనీతో పాటు, మొమెంటోలు అందజేయనున్నట్లు మ్యాచ్ ఆర్గనైజర్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తల వెంకటరమణ, బాహుద్దీన్, మాజీ మండల కన్వీనర్ బాబాఫక్రుద్దీన్, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకుల వితరణ

ధర్మవరం అర్బన్: కాశీ విశాలాక్షి సహిత విశ్వనాథస్వామి ఆలయానికి సుజాతమ్మ జ్ఞాపకార్థం కుమార్తెలు నీరజదేవి, షర్మితిదేవి, హెలసాదేవి శుక్రవారం రెండు వాటర్ ట్యాంకులను ఆలయ ప్రధాన అర్చకులు ద్వారకనాథ్‌శర్మకు అందజేశారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వైకే శ్రీనివాసులు, సభ్యులు డాక్టర్ బీవీ సుబ్బారావు, చాంద్‌బాషా, బండ్లపల్లి రంగనాథ్, నాగేంద్ర, రమేష్ బాబు, నాగేంద్ర, వినోద్ పాల్గొన్నారు.

మంచి చేస్తున్న జగన్‌కే మా మద్దతు



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు మూడే శాంతమ్మ. తనకల్లు మండలం మొగలిచెట్లతండాలో నివసిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈమె కుటుంబానికి ఇప్పటి వరకూ వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ (రైతులకు), వైఎస్సార్ పింఛను కానుక, వైఎస్సార్ చేయూతతో కలిపి మొత్తం 1,47,247 లబ్ధి చేకూరింది. పథకాల ద్వారా అందిన నగదుతో తండాలోనే చిన్న అంగడి పెట్టుకుంది. తమలాంటి పేదల జీవితాల్లో వెలుగులు నింపిన వైఎస్ జగన్‌కు వచ్చే ఎన్నికల్లో అండగా ఉంటామని శాంతమ్మ చెబుతోంది.

- నవరత్నాల్లోని పథకాలు భేష్
- జగనన్న పాలన బాగుంది
- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో లబ్ధిదారుల హర్షం



బత్తలపల్లి: సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



తనకల్లు: ఎంసీ తండాలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

తనకల్లు: పేదల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటామని ప్రజలు భరోసా ఇచ్చారు. పథకాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న జగన్‌కు ఓటు వేస్తామని తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని మొగలిచెట్లతండా, రామ్లానాయక్‌తండా, ఉంగరాల ఇండ్లు, ఏగువతొట్లిపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నట్లు లబ్ధిదారులు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని వివరించారు. లబ్ధిదారులకు బుక్‌లెట్లు అందజేశారు. మీ ప్రాంతాల్లో పరిష్కారానికి నోచుకోని సమస్యలు ఏవైనా ఉంటే తెలియజేయాలని, సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణం వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు. రామ్లానాయక్‌తండాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని పలువురు విన్నవించారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఏఈ శ్రీకాంత్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు.

ఇంటి పట్టాలు మంజూరు చేయించాలని పలువురు మహిళలు కోరడంతో అర్హులైన వారికి ఇంటి స్థలానికి పొజిషన్ సర్టిఫికెట్లను అందజేయాలని వీఆర్వో వేమనారాయణకు సూచించారు. తండాల్లోని కొన్ని వీధులకు సీసీ రోడ్డు లేకపోవడంతో సీసీ రోడ్ల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఎగువతొట్లిపల్లిలో మినీ అంగన్‌వాడీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ పూల నరసింహులు, సర్పంచులు సురేష్ రెడ్డి, కృష్ణారెడ్డి, నాగేంద్ర, మునేనాయక్, ఎంపీటీసీలు జయప్రద, ఈశ్వరప్ప, హిమధర్‌రెడ్డి, శ్రీనివాసులు, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ మల్లికార్జున, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్‌దేశాయ్, నాయకులు శ్రీనివాసులనాయుడు, నీలకంఠారెడ్డి, సిద్దారెడ్డి, బాబాఫక్రుద్దీన్, శ్రీరాములు, గోపాల్‌నాయక్, రమేష్ నాయక్, శ్రీనివాసులనాయక్, గణేష్‌రెడ్డి, బాల్‌రెడ్డి, చిన్నప్పరెడ్డి, రహంతుల్లా, వెంకటనారాయణ పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్‌కు బుద్ధి చెప్పండి

బత్తలపల్లి: సంక్షేమ పథకాలతో ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. లాస్ట్ ఛాన్స్ అంటూ మభ్యపెట్టే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, ఒక్క చాన్స్ అంటున్న పవన్ కళ్యాణ్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. శుక్రవారం ఉప్పర్లపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ.. పథకాలను వివరించారు. సమస్యలు ఏవైనా ఉన్నాయా? అంటూ అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిలో పది శాతమైనా గత ప్రభుత్వంలో జరిగిందా అని ప్రశ్నించారు. సంక్షేమంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ముందంజలో ఉందన్నారు. మూడున్నరేళ్ల పాలనలో పార్టీలు, మతాలకు అతీతంగా ప్రజలందరికీ సమానంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు వివరించారు. భావితరాల బంగారు భవిత కోసం రాష్ట్రంలో 30 ఏళ్ల పాటు సీఎం జగన్ పాలన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిపక్షాల మాయమాటలు నమ్మి మోసపోతే జరిగే నష్టం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే అన్నారు. పేదలు ఆత్మస్థైర్యంతో జీవించే పరిస్థితి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉందని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆదేశం

గ్రామంలో పర్యటిస్తుండగా ప్రజలు వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో వీధుల్లో సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయాలని, విద్యుత్ లైన్లు వేయించాలని కోరారు. మరికొందరు తమకు ఫించన్లు అందలేదని తెలపడంతో వారి ముందే అధికారులతో అందుకు కారణాలను వివరించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి, సర్పంచు చల్లా కరుణాకర్‌నాయుడు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎంపీపీ గుర్రం వనజ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, నాయకులు బీసీ సెల్ మండల అధ్యక్షుడు రామాంజనేయులు, సుంకన్న, కె.వెంకటనారాయణ, ఏ.నాగభూషణ, ఆదెప్ప, ఎన్.నారాయణస్వామి, శ్రీధర్‌రెడ్డి, మధుసూదనరెడ్డి, చెన్నారెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాసరెడ్డి బ్రదర్స్, ఈశ్వరయ్య, ఆంజనేయులు, సూరిబాబు, లింగారెడ్డి, రవీంద్రారెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

సచివాలయ ప్రారంభోత్సవం

బత్తలపల్లి: సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టి గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దంపెట్ల గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని ఎంపీపీ గుర్రం వనజతో కలిసి ప్రారంభించారు. కార్యాలయంలో వివిధ చాంబర్‌లను సర్పంచులు చల్లా కరుణాకర్‌నాయుడు, పద్మావతి, పంచాయతీరాజ్ ఈఈ లోకన్న, తహసీల్దార్ యుగేశ్వరిదేవి, ఎంపీడీఓ సాయిమనోహర్, మండల ఇంజనీర్ రమణయ్య, కార్యదర్శి భారతి తదితరులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్లు వెంకటనారాయణ, కృష్ణమూర్తి, నగేష్, ఓబులయ్య, నాయకులు చంద్ర, ఆదిశేషయ్య, కాటమ రాజు, కట్టకిందపల్లి రవీంద్రనాయుడు, నారాయణస్వామి, సూర్యచంద్రాపురం ఆదినారాయణ, లక్ష్మీనారాయణ, మంజుల రమణ, వెంకటపతి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

బత్తలపల్లి: టీబీ వ్యాధిగ్రస్తులకు చికిత్స కాలంలో (ఆరు నెలలు) మందులతో పాటు సరైన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే వ్యాధిని నయం చేసుకోవచ్చునని జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ తిప్పయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ నిక్షయ మిత్ర కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా ప్రస్తుతం చికిత్స పొందుతున్న 23 మంది టీబీ (క్షయ) వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదరికంతో మంచి పోషకాహారాన్ని తీసుకోలేని 8 మంది టీబీ వ్యాధిగ్రస్తులకు ఒక్కొక్కరికి రూ.3 వేలు విలువైన పోషణ కిట్లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఫార్మసిస్ట్ సరస్వతి నలుగురికి, ఆరోగ్య పర్యవేక్షకుడు చంద్రశేఖర్‌రెడ్డి ఇద్దరికి, వేమారెడ్డి, స్టాఫ్ నర్సు కలిసి ఇద్దరికి విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి తేజశ్రీ, సీహెచ్‌ఓ రాజశేఖర్, ఫార్మసిస్ట్ సరస్వతి, స్టాఫ్ నర్సు సుకన్య, పర్యవేక్షకుడు వేమారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, క్షయ వ్యాధి నియంత్రణ సిబ్బంది బాషా, ఎర్రిస్వామి పాల్గొన్నారు.



పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ అధికారి తిప్పయ్య

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

పుట్టపర్తి టౌన్: పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ బసంత్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, విద్యాభివృద్ధికి ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించేలా చూడాలన్నారు. విద్యారంగంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు, సంస్కరణలు చేపట్టి సమూల మార్పులు తీసుకొచ్చారని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, రమణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి, నారాయణ స్వామి, చంద్రశేఖర్ రెడ్డి, గోపీ కృష్ణ, రామాంజనేయులు, చెన్నారెడ్డి, అమీర్ సాహెబ్, కొండారెడ్డి, మహేష్, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్, పీఆర్‌టీయూ నాయకులు

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ దుర్మార్గం

ధర్మవరం: కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ పారిశ్రామికవేత్తలకు వత్తాసు పలుకుతోందని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న ఆరోపించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్, విమానాలు, నౌకలు, రైల్వే, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలను ప్రైవేటీకరణ చేస్తూ అంబానీ, అదాని లాంటి వాళ్లకు అప్పగిస్తున్నారన్నారు. ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చాక నల్ల డబ్బుని తిరిగి భారతదేశానికి రప్పిస్తూ భారతదేశంలో ఉన్నటువంటి రేషన్ కార్డు కలిగిన పేదలకు ఒక్కొక్కరికి రూ.15 లక్షలు ఇస్తామని మోసం చేశారని మండిపడ్డారు. గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెంచడం దారుణమన్నారు. రైతులకు అన్యాయం చేసేందుకు నల్ల చట్టాలు తీసుకువచ్చారన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మిక, కర్షక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకులు ఎస్‌హెచ్‌బాషా, మండల అధ్యక్షుడు ఆదినారాయణ, కార్యదర్శి ఆయుబ్‌ఖాన్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తల కదిరప్ప, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నామాల నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

తలుపుల: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని ఓబులరెడ్డిపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బత్తల హరిప్రసాద్ ఆధ్వర్యంలో 1000 మంది పేద మహిళలకు సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బత్తల వెంకటరమణ చీరలు పంపిణీ చేశారు. ఓబులరెడ్డిపల్లి గ్రామంలో మసీదు నిర్మాణానికి రూ.1.50 లక్షల విరాళాన్ని బత్తల హరిప్రసాద్ అందజేశారు.



మహిళకు చీర అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుండెపోటుతో రైతు మృతి

తాడిమర్రి: పంట పెట్టుబడులకు చేసిన అప్పుల బాధలు తాళలేక గుండెపోటుతో ఓ రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని పెద్దకోట్లలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. గోగుల పెద్దరాజు (50), వరాలమ్మ దంపతులకు కుమారుడు ప్రవీణ్, ప్రసన్న, షర్మిల ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ పోషణకు పెద్దమ్మ దేవత ఆలయ పూజారిగా పని చేస్తూనే తనకున్న 8 ఎకరాల్లో పదిహేనేళ్లుగా వేరుశనగ సాగు చేస్తున్నాడు. పంటలు పండకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక మదనపడుతుండే వాడు. శుక్రవారం భార్య వరాలమ్మ కూలి పనికి వెళ్లడంతో ఉదయం 7 గంటల సమయంలో అన్నం తిని కూర్చున్నాడు. అంతలోనే వాంతులు చేసుకుని, రొమ్ములో నొప్పిగా ఉందని కూలిపోయాడు. గమనించిన చుట్టుపక్కల వారు వైద్య చికిత్స కోసం ఆటోలో తాడిమర్రిలోని ప్రైవేటు వైద్యుని వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి మృతుని భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



పెద్దరాజు (ఫైల్)

ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి

అమడగూరు: మండల వ్యాప్తంగా రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన అన్ని రకాల పంటలను ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి జ్యోత్స్న శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదిహేను రోజులుగా సచివాలయ వ్యవసాయ సిబ్బంది ఈ-క్రాప్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. పాస్‌పుస్తకం, ఆధార్ కార్డుతో సచివాలయంలో సంప్రదించాలన్నారు. ఈ-క్రాప్ చేయించుకుంటేనే ప్రభుత్వ పరిహారం అందుతుందన్నారు.

ఈనెల 15వ తేదీ తుది గడువు..

తలుపుల: ఈనెల 15లోపు రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ షాదాబ్ అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ చెన్నకృష్ణారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పీఎంకిసాన్‌కు గ్రామాల్లో రైతులను గుర్తించి ఈ-కేవైసీతోపాటు, పంటల సాగును ఈ-క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. లేకపోతే ప్రభుత్వం నుంచి రాయితీలు వర్తించవని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో పరుగుల మందులు, టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా ఉన్నతాధికారులకు రిపోర్టు పంపాలని సూచించారు.

వంటగ్యాస్ ఆదాపై అవగాహన

తాడిమర్రి: ధర్మవరానికి చెందిన లక్ష్మీ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో శుక్రవారం గ్యాస్ ఆదాపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రెషర్ కుక్కర్‌లో భోజనం వండితే రుచిగా ఉండటంతో పాటు గ్యాస్ ఆదా అవుతుందన్నారు. అలాగే భోజనం వండటానికి అయ్యే సమయం కూడా తక్కుతుందన్నారు. ఫ్రిజ్‌లోని ఆహార పదార్థాలు తీసిన అరగంట తర్వాత ఉడికించుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీరాములు, రెడ్డెప్ప, రాజు పాల్గొన్నారు.

సంక్రాంతి శుభాకాంక్షలు

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



పుట్టపర్తి టౌన్: రైతన్నలు, గ్రామీణ వృత్తుల వారు, ప్రజలు సుఖశాంతులతో జీవించాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆకాంక్షించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల జీవితాల్లో భోగి పండుగ భాగ్యాలు తేవాలని, సంక్రాంతి నవకాంతులు నింపాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా సుధాకర్‌రెడ్డి



పుట్టపర్తి: బుక్కపట్నం మండల వైఎస్సార్‌సీపీ నూతన కమిటీని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డి శుక్రవారం ప్రకటించారు. మండల కన్వీనర్‌గా సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, పెద్ద కేశప్ప, ప్రధాన కార్యదర్శులుగా సురేష్‌నాయక్, రంగారెడ్డి, పసల నాగభూషణ, కోశాధికారిగా హనుమంతరెడ్డి, కార్యదర్శులుగా నాగరాజు, సూర్యనారాయణరెడ్డి, కృష్ణమూర్తి, రఘునాథరెడ్డి, మల్లికార్జున, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాసులు, చంద్రాయుడు, సోమశేఖర్, మల్లేష్, మల్లికార్జున, చింతల్‌రెడ్డి, టి.మల్లేశ్, రాజప్ప, అక్కులప్ప, రాజు, బాబు, కృష్ణారెడ్డి, సతీష్, సి.సురేష్, వెంకటనారాయణ, ఇప్పాన్, శంకర్, బాలు నాయక్‌ను ఎంపిక చేశారు.

వానరానికి అంత్యక్రియలు

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీలో చిత్రావతి రోడ్డు సమీపంలో శుక్రవారం అపార్టుమెంట్ వద్ద విద్యుత్ షాక్‌తో వానరం మృతి చెందింది. గమనించిన స్థానికులు కిద్మత్ ఏ ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్‌కు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న ట్రస్ట్ సభ్యులు మృతి చెందిన వానరానికి హిందూ సాంప్రదాయ పద్ధతి ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు షామీర్, చాంద్ పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోండి

పుట్టపర్తి: రైతు భరోసా కేంద్రాల్లో నగదు జమ చేసుకొనేందుకు వీలుగా స్కానర్లు అందుబాటులో ఉంచామని ఏఓ సతీష్, మండల అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ వెంకట చౌదరి తెలిపారు. శుక్రవారం బుక్కపట్నం ఆర్బీకేలో కమిటీ సభ్యులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీఎం కిసాన్ కోసం ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. సబ్సిడీపై అందించే బిందు, తుంపర పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశు సంవర్ధక శాఖలో వైఎస్సార్ పశునష్ట పరిహారానికి బదులుగా వైఎస్సార్ పశు బీమా కొనసాగిస్తున్నట్లు పశు వైద్యుడు ఉదయ్ కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మారాల సొసైటీ మాజీ అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి, కమిటీ సభ్యులు గోపి స్వామి, జయరాం పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం



ఖాతాదారులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న బ్యాంక్ చైర్మన్ రాకేష్ కపిల్

ముదిగుబ్బ: స్థానిక ఏపీజీబీలో శుక్రవారం ఖాతాదారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆ బ్యాంక్ చైర్మన్ రాకేష్ కపిల్, రీజనల్ మేనేజర్ రవీంద్రారెడ్డి హాజరై, మాట్లాడారు. బ్యాంక్ తరపున ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. డిపాజిట్‌దారులకు అధిక వడ్డీలు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంక్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఉత్తమ ఖాతాదారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

విజేతలకు అభినందన

కదిరి అర్బన్: ఇటీవల జమ్మూలో జరిగిన 23వ జాతీయ స్థాయి స్పూ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను శుక్రవారం ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ ఎస్‌కేవలీ, కరాటే మాస్టర్ షాకీర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

'రూడ్‌సెట్' శిక్షణ కార్యక్రమాలపై అవగాహన

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి, అలీపూర్‌తండాల్లో శుక్రవారం వెలుగు ఏపీఎం శారదారెడ్డి ఆధ్వర్యంలో రూడ్‌సెట్ సంస్థ ఆధ్వర్యంలో అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలపై అవగాహన సదస్సు జరిగింది. రూడ్‌సెట్ డైరెక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. టైలరింగ్, బ్యూటీపార్లర్, జర్దోసీ, మగ్గంవర్క్, జనపనార బ్యాగుల తయారీపై శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తారని తెలిపారు. ఆసక్తిగల మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్లు వీరమారుతి, నాగప్ప పాల్గొన్నారు.

సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడిగా కుళ్లాయిరెడ్డి

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా కొట్లపల్లి సర్పంచు కుళ్లాయిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 14 గ్రామాల సర్పంచులతో సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా కుళ్లాయిరెడ్డి, ఉపాధ్యక్షురాలిగా వెంకటగారిపల్లి సర్పంచ్ లక్ష్మీదేవి, కోశాధికారిగా జగరాజుపల్లి సర్పంచ్ లక్ష్మీనరసమ్మను ఎంపిక చేశారు. సంఘం సభ్యులకు ఎంపీపీ రమణారెడ్డి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ మెంబర్ మాహబూబ్‌సాబ్, సర్పంచులు మంగ్లీబాయి, లతా, కామాక్షమ్మ, భారతమ్మ, రామచంద్ర, లీలావతి, వెంకటేషు, శ్రీనివాసులు, ప్రవీణ్, చిన్నపెద్దన్న, గంగమ్మ, ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

దళిత, గిరిజనుల భూములు కాపాడాలి

బత్తలపల్లి: దళిత, గిరిజనుల భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి అధికారులను కోరారు. శుక్రవారం బత్తలపల్లి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పలు గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలకు చెందిన వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాలు, చివరకు స్మశాన వాటికలను దౌర్జన్యంగా ఆక్రమించారని ఆరోపించారు. 8వ విడత భూ పంపిణీలో నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో భూ బాధితులు శ్రీకాంత్, పెద్దన్న, వేదవతి, గణేష్, ప్రియాంక ఉన్నారు.